అన్నపూజ, ఏకాదశ రుద్రాభిషేకం

అన్నపూజ, ఏకదశరుద్రాభిషేకం నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు

చేర్యాల, మార్చి 9: కొమురవెల్లి మల్లికార్జునస్వామి మహాశివరాత్రి పూజల్లో భాగంగా పెద్దపట్నం కార్యక్రమాన్ని ఆలయవర్గాలు నిర్వహించాయి. శనివారం మల్లన్న ఆలయంలో ఆలయ అర్చకులు స్వామివారికి అత్యంత భక్తి శ్రద్ధలతో పరమపవిత్రంగా అన్నపూజతో పాటు ఏకాదశ రుద్రాభిషేకం తదితర పూజలు నిర్వహించారు. ఆలయ గర్భాలయంలో స్వామివారి ముందున్న శివ లింగం వద్ద అత్యంత పవిత్రంగా తయారు చేసిన అన్నం తీసుకువచ్చి స్వామివారి ప్రతిమను ఆలయ అర్చకులు తయారు చేసి అన్న పూజ నిర్వహించారు. అనంతరం ఏకదశరుద్రాభిషేకం చేశారు.

జయపాల్‌రెడ్డి సేవలు భేష్

మల్లారెడ్డిపల్లిలో వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాపరెడ్డి

వర్గల్, మార్చి 9: మల్లారెడ్డిపల్లికి చెందిన బీఆర్‌ఎస్ నేత, ఉపసర్పంచ్‌లఫోరం వర్గల్ మండల అధ్యక్షుడు జయపాల్‌రెడ్డి సేవలు యువతకు స్ఫూర్తిదాయకమని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాపరెడ్డి అన్నారు. శనివారం వర్గల్ మండలం మల్లారెడ్డిపల్లిలో జయపాల్‌రెడ్డి సొంతనిధులతో గ్రామంలో ఏర్పాటు చేసిన వాటర్‌ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రతాపరెడ్డి మాట్లాడుతూ బీఆర్‌ఎస్‌లో క్రియాశీలకంగా పనిచేస్తూనే మరిన్ని సేవాకార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్, ఎంపీటీసీలతోపాటు బీఆర్‌ఎస్ మండల నాయకులు పాల్గొన్నారు.

మహిళా ఉపాధ్యాయులకు సన్మానం

ఉపాధ్యాయినులను సన్మానిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులారాజనర్సు

సిద్దిపేట, మార్చి 9: సిద్దిపేట పట్టణంలోని విపంచి కళానిలయంలో పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. జడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రోజాశర్మ, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులారాజనర్సుతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.గజ్వేల్ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న పద్మజ చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. గజ్వేల్ పట్టణానికి చెందిన కుమారి మృణాళిని ఇటీవల ఐదు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపిక కావడంపై హర్షం వ్యక్తం చేస్తూ ఆమెను జడ్పీ చైర్‌పర్సన్, మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రత్యేకంగా సన్మానించారు.కార్యక్రమంలో గంగ, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు శశిధర్‌శర్మ, విజయ, మహిళా ఉపాధ్యాయురాళ్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- కార్యకర్తలకు అండగా ఉంటాం
- మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

బెజ్జంకి, మార్చి 9: ఎంపీ ఎన్నికల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు గెలుపే లక్ష్యంగా పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ సూచించారు. మండల కేంద్రంలోని సత్యార్జున గార్డెన్‌లో శనివారం కార్యకర్తల సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ అమలు కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ కుట్రపూరిత పాలనపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పంటలు ఎండుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయంలో రైతుల పంటలు ఎండకుండా మండుటెండల్లో సైతం కాళేశ్వరం జలాలను సరఫరా చేసి పంటలను కాపాడుకున్నామన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వ్యవసాయ పంటలకు సాగునీరు అందించి కాపాడాలని కోరారు. బీజేపీ ఎంపీగా గెలిచిన బండి సంజయ్ పార్లమెంట్ పరిధిలో ఏ ఒక్క అభివృద్ధి పనులు చేపట్టలేదన్నారు. పార్లమెంట్ పరిధిలో అభివృద్ధి జరగాలంటే బీఆర్‌ఎస్ అభ్యర్థి బోయినిపల్లి వినోద్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. మండలంలో పలు అభివృద్ధి పనుల కోసం మంజూరైన రూ.5 కోట్లను ఇప్పటి ప్రభుత్వం రద్దు చేసిందని, తిరిగి తెచ్చేందుకు నిరసన కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఈనెల 12న కరీంనగర్‌లో నిర్వహించే సమావేశానికి భారీ సంఖ్యలో ప్రజలు, నాయకులు, కార్యకర్తలు తరలిరావలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు పాకాల మహిపాల్‌రెడ్డి, నాయకులు లింగాల లక్ష్మణ్, కనగండ్ల తిరుపతి, నరేశ్ పాల్గొన్నారు.

శారీరక దారుఢ్యానికి క్రీడలు దోహదం

మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత

హుస్నాబాద్ రూరల్, మార్చి 9: శారీరక దారుఢ్యానికి క్రీడలు దోహదం చేస్తాయని హుస్నాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత అన్నారు. మండలంలోని పోతారం(ఎస్)లో శనివారం కృష్ణ కబడ్డీ క్లబ్ ఆధ్వర్యంలో రెండురోజుల పాటు నిర్వహించనున్న జిల్లా స్థాయి కబడ్డీ టోర్నమెంట్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో జిల్లా స్థాయి టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ అయిలేని అనిత, టీపీసీసీ సభ్యుడు కేడం లింగమూర్తి, మాజీ సర్పంచ్ బత్తిని సాయిలు, ఎంపీటీసీ బొమ్మగాని శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

- గౌరవెల్లి రిజర్వాయర్ మిగులు పనులు వెంటనే పూర్తిచేయాలి
- బీఆర్‌ఎస్ నియోజకవర్గ నాయకుడు అయిలేని మల్లికార్జున్‌రెడ్డి

కూచనపల్లిలో ఎండిన వరిని పరిశీలిస్తున్న మల్లికార్జున్‌రెడ్డి

హుస్నాబాద్, మార్చి 9: సాగునీరు అందక పంట ఎండిపోయి నష్టపోయిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని బీఆర్‌ఎస్ నియోజకవర్గ నాయకుడు అయిలేని మల్లికార్జున్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం హుస్నాబాద్ మండలం కూచనపల్లిలో ఎండిపోయిన పంటలను స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు, రైతులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యవసాయం మీదే ఆధారపడి జీవిస్తున్న రైతులు వేలాది రూపాయల పెట్టుబడి పెట్టి పంట చేతికొచ్చే సమయంలో ఎండిపోయి దిక్కుతోచని పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నీళ్ల కోసం వేలాది రూపాయలు ఖర్చుచేసి బోర్లు వేస్తున్నా నీళ్లు రావడం లేదన్నారు. ఎకరానికి కనీసం రూ.40వేల పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. హుస్నాబాద్ నియోజకవర్గ రైతుల వరప్రదాయిని అయిన గౌరవెల్లి మిగులు పనులను వెంటనే పూర్తి చేసి భవిష్యత్‌లో నీటి ఇబ్బందులు ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు అయిలేని గాల్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, జానకిరాంరెడ్డి, పుప్పాల రమ ణ, అనిల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పల్లాకు సన్మానం

ఎమ్మెల్యే పల్లాను సన్మానిస్తున్న కురుమ, యాదవ సంఘం నాయకులు

చేర్యాల, మార్చి 9 : జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని ఆకునూరు కురుమ, యాదవ సంఘాల నాయకులు గొంగడి కప్పి ఘనంగా శనివారం జనగామ జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో సన్మానించారు. ఆకునూరులో బీరప్ప గుడి నిర్మాణంతో పాటు పండుగకు ఎమ్మెల్యే పల్లా రూ.60,116 విరాళంగా కురమ,యాదవ సంఘం నాయకులు అందజేశారు. కార్యక్రమంలో కురుమ, యాదవ సంఘం నాయకులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబాన్ని పరామర్శ

మండలంలోని ఆకునూరు గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు తాటికొండ యాదయ్య తండ్రి లక్ష్మీనర్సయ్య ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి శనివారం మృతుడి కుటుంబ సభ్యులను ఫోన్‌లో పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు.

మిడ్ మానేరు నుంచి నీటిని ఎత్తిపోయాలి

చిన్నకోడూరు, మార్చి 9: మిడ్ మానేరు రిజర్వాయర్ నుంచి ఒక టీఎంసీ నీటిని రిజర్వాయర్‌లోకి ఎత్తిపోయాలని ఎంపీపీ కూర మాణిక్యరెడ్డి కోరారు. చిన్నకోడూరులోని ఎంపీపీ చాంబర్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మిడ్ మానేరు రిజర్వాయర్‌లో నీళ్లు ఉన్నప్పటికీ అనంతగిరి, రంగనాయక సాగర్ రిజర్వాయర్‌లోకి నీటిని ఎందుకు ఎత్తిపోయడం లేదని ప్రశ్నించారు. ఒక టీఎంసీ నీటిని రిజర్వాయర్‌లోకి ఎత్తి పోసినట్లైతే యాసంగి పంటలన్నీ ఎండకుండా ఉంటాయన్నారు. అనంతగిరి, రంగనాయక సాగర్ రిజర్వాయర్‌లో ప్రస్తుతం ఉన్న 1.5 టీఎంసీల నీరు యాసంగి పంటలకు సరిపోవడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును రైతులు, ప్రజలు గమనిస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డి తెలుసుకోవాలన్నారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

దుబ్బాక,మార్చి9: దుబ్బాక శివారులో అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను దుబ్బాక పోలీసులు పట్టుకున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల శివారులోని వాగు నుంచి ఇసుకను అక్రమంగా శనివారం వేకువజామున దుబ్బాక మండలానికి తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను గుర్తించారు. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకతరలిస్తున్న ట్రాక్టర్ డ్రైవర్లతో పాటు యజమానులపై కేసు నమోదు చేసినట్లు దుబ్బాక ఎస్సై గంగారాజు తెలిపారు. ముస్తాబాద్ మండలం గూడెం గ్రామానికి చెందిన రమేశ్ (డ్రైవర్), ఉపేందర్ (ట్రాక్టర్ ఓనర్), పోత్గల్‌కు చెందిన సురేశ్ (డ్రైవర్), శ్రీకాంత్(ఓనర్), ఫరీద్‌పై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మద్దూరు మండలంలో...

మద్దూరు(ధూళిమిట్ట), మార్చి 9: మద్దూరు మండలంలోని వల్లంపట్ల గ్రామ శివారులో అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ అధికారులు, మద్దూరు పోలీసులు తెలిపారు. తెల్లవారుజామున ఎలాంటి అనుమతులు లేకుండా వల్లంపట్ల గ్రామ శివారు నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నారని నమ్మదగిన వ్యక్తులు ఇచ్చిన సమాచారం మేరకు దాడులు నిర్వహించి నంబర్లు లేని రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ముస్తాబాద్ మండలానికి చెందిన ట్రాక్టర్‌ను పట్టుకున్న పోలీసులు

చేపలవేటకు వెళ్లి.. శవమై తేలి..

వర్గల్,మార్చి 9 : మండలంలోని తున్కిఖల్సా గ్రామానికి చెందిన వ్యక్తి స్థానిక చెరువులో చేపలవేటకోసం వెళ్లి మృతిచెందాడు. గౌరారం ఎస్సై శివకుమార్ తెలిపిన వివరాల ప్రకారం ..గ్రామానికి చెందిన మన్నె కిష్టయ్య(50) శుక్రవారం మధ్యాహ్నం వ్యవసాయ పొలం వద్దకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి స్థానిక తఫాల్‌ఖాన్ చెరువులో చేపలు పట్టడానికి వెళ్లాడు. కానీ ఎంతకూ ఇంటికి తిరిగిరాకుంటే అక్కడికి వెళ్లి వెతకసాగారు. రువు పక్కనే కిష్టయ్య బట్టలు ఉన్నాయని అతని కొడుకుకు శనివారం ఉదయం మన్నె పెంటయ్య అనే వ్యక్తి చెప్పాడు. దీంతో చెరువులో చూడగా కిష్టయ్య మృతదేహం కనిపించింది. పోలీసులు మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

ప్రశాంతంగా ఓటుహక్కు వినియోగించుకోవాలి

వర్గల్, మార్చి 9: ప్రశాంతంగా ఓటుహక్కు వినియోగించుకోవాలని తొగుట సీఐ లతీఫ్ అన్నారు. మండలంలోని నెంటూర్‌లో శనివారం గ్రామస్తులకు ఓటుహక్కు ప్రాధాన్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటుహక్కును వినియోగించుకోవాలన్నా రు. బెదిరింపులకు లోను కావద్దన్నారు. సైబర్ నేరాలు, గంజాయి, మద్యం, జూదం లాంటి విషయాల్లో యువత అప్రమత్తంగా ఉండి పోలీసులకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై రవికాంత్‌రావు, స్టేషన్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు హాఫ్ మారథాన్

హుస్నాబాద్, మార్చి 9: హుస్నాబాద్ పట్టణంలో ఆదివారం హాఫ్ మారథాన్ (21కి.మీ.ల పరుగు పందెం) జరుగుతుందని ఏసీపీ సతీశ్ వాసాల శనివారం ప్రకటనలో తెలిపారు. రన్నర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ఉదయం ఆరు గంటలకు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. హాఫ్ మారథాన్‌తో పాటు 10కేరన్, 5కేరన్ కూడా నిర్వహించడం జరుగుతుందని, ఇందులో పాల్గొనే వారికి ప్రశంసాపత్రాలు, మెడల్స్ అందజేస్తామని చెప్పారు. విజేతలకు నగదు బహుమతి ఉంటుందన్నారు. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ హాఫ్‌మారథాన్‌ను ప్రారంభిస్తారని తెలిపారు. హుస్నాబాద్ పట్టణం నుంచే కాకుండా జిల్లా వ్యాప్తంగా రన్నర్స్ అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఆకట్టుకున్న బండ్ల ఊరేగింపు

జగదేవ్‌పూర్: తీగుల్ గ్రామంలో ఎడ్ల బండ్ల ఊరేగింపు

జగదేవ్‌పూర్, మార్చి9: మండల కేంద్రంతో పాటు తీగుల్‌లో శివరాత్రి ఉత్సవాలు వేడుకగా నిర్వహించారు. తీగుల్‌లో పార్వతీపరమేశ్వర ఆలయంలో శనివారం ఉదయం కల్యాణోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. గ్రామానికి చెందిన వందలాది భక్తులు స్వామి వారి కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం ఆలయం ముందు అగ్నిగుండం ప్రవేశం చేశారు. సాయంత్రం గ్రామంలో ఎడ్లబండ్ల ఊరేగింపు నిర్వహించారు. జగదేవ్‌పూర్ భ్రమరాంబమల్లికార్జునస్వామి ఆలయం వద్ద అగ్నిగుండాలు,ఎడ్లబండ్ల ఊరేగింపు నిర్వహించారు.

గట్టు మల్లన్న ఆలయంలో పూజలు

మద్దూరు(ధూళిమిట్ట), మార్చి 9: ధూళిమిట్ట మండలంలోని కొండాపూర్ గట్టు మల్లన్న ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి గట్టు మల్లన్నను దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు కొట్టె రాజమౌళి, మహేశ్ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. రాజరాజేశ్వరి మాతకు కుంకుమార్చనలు చేశారు. ఒగ్గు పూజారులచే భక్తులు పట్నాలు వేయించుకున్నారు. అక్కన్నపేట మండలంలోని రామవరం గ్రామానికి చెందిన ఎడబోయిన శోభ-జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆలయం వద్ద మహా అన్నదానం చేశారు. పోచమ్మ, ఎల్లమ్మ ఆలయాల నిర్మాణాలకు సహకరించిన జైపాల్‌రెడ్డి దంపతులను ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి రాచమల్ల అశోక్, టెక్నికల్ అసిస్టెంట్ శ్రీనివాస్, మాజీ సర్పంచ్‌లు జాటోత్ రేణుక, ప్రభాకర్‌గౌడ్, నరేశ్, శ్రీధర్, కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా రామలింగేశ్వరస్వామి జాతర

మిరుదొడ్డి (అక్బర్‌పేట-భూంపల్లి), మార్చి 9: అక్బర్‌పేట-భూంపల్లి మండలంలోని మోతె శివారులోని రామలింగేశ్వర స్వామి ఆలయగుట్టపై శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం నుంచి స్వామివారికి ఆలయంలోప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం సాగిన జాతరకు మిరుదొడ్డి, అక్బర్‌పేట-భూంపల్లి మండలాల్లోని కాసులాబాద్, మల్లుపల్లి, మోతె, చిట్టాపూర్, హబ్షీపూర్ గ్రామాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. జాతరకు వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా మాజీ సర్పంచ్ కాలేరు శ్రీనివాస్, అధికారులు సౌకర్యాలు కల్పించారుకల్పించారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

పెద్ద పట్నం వేస్తున్న ఒగ్గు పూజారులు

మద్దూరు(ధూళిమిట్ట), మార్చి 9: ధూళిమిట్ట మండలంలోని బెక్కల్ రామలింగేశ్వర స్వామి ఆలయంలో గత నెల 24న ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు శనివారం తెల్లవారుజామున ముగిశాయి. ఈ సందర్భంగా ఒగ్గు పూజారుల ఆధ్వర్యంలో ఒగ్గు డోలు వాయిద్యాలు, శివసత్తుల పూనకాల మధ్య మల్లన్న స్వామికి పెద్దపట్నం వేశారు. పెద్ద పట్నాన్ని వీక్షించేందుకు వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ పరిసరాల్లో ఒగ్గు పూజారుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. అంతకు ముందు బెక్కల్ గ్రామస్తులు బోనాలు సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చొప్పరి మల్లేశం, కురుమ సంఘం మండల అధ్యక్షుడు బర్మ రాజమల్లయ్య, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

భక్తులకు అన్నం వడ్డిస్తున్న ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

ముగిసిన ఆలయ వార్షికోత్సవం

గజ్వేల్‌అర్బన్, మార్చి9: మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్ పార్థివేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాలు శనివారం ముగిశాయి. శనివారం అగ్నిగుండాలు, భద్రకాళిపూజ, వీరభద్ర విజయోత్సవం పూజలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, కౌన్సిలర్లు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కనులపండువగా మల్లన్న కల్యాణం

మర్కూక్,మార్చి 9: మండలంలోని చేబర్తి, నర్సన్నపేట గ్రామాల మధ్యలో గల మల్లన్న ఆలయంలో స్వామివారి కల్యాణాన్ని శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి విశేష పూజలు చేశారు. గ్రామ యాదవ సంఘం ఆధ్వర్యంలో స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. కల్యాణాన్ని తిలకించడానికి చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులు అగ్నిగుండాలు తొక్కారు. అనంతరం గ్రామానికి చెందిన భూకల శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. భక్తులకు ఎలాంటి అ సౌకర్యంగా కలుగకుండా జడ్పీటీసీ మంగమ్మారామచంద్రం, తాజామాజీ సర్పంచ్ మాదవీరాజిరెడ్డి, భూకల మల్లేశ్‌యాదవ్ ఏర్పాట్లు చేశారు.

శివపార్వతుల కల్యాణం

కొమురవెల్లి, మార్చి 9 : మండలంలోని గురువన్నపేట భవానీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి వేద పండుతుడు మహాదేవభట్ల ఆనంద్‌శర్మ ఆధ్వర్యంలో శివపార్వతుల కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. ఉత్సహా విగ్రహాలను గ్రామపంచాయతీ కార్యాలయం నుంచి ఆలయం వరకు ఊరేగింపుగా డప్పుచప్పుళ్ల మధ్య తీసుకు వచ్చి భక్తుల మధ్య శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. అనంతరం పరమేశ్వరుడికి అభిషేకం చేశారు. జాగరణ కోసం వచ్చిన భక్తులకు ట్రస్టు సభ్యులు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రామలింగేశ్వర స్వామి ట్రస్టు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి

స్వర్ణను సన్మానిస్తున్న సంతోష్‌కుమార్

మద్దూరు(ధూళిమిట్ట), మార్చి 9: చదువుతో పాటు యువత క్రీడల్లో రాణించాలని బీఆర్‌ఎస్ మద్దూరు మండల అధ్యక్షుడు మేక సంతోష్‌కుమార్ అన్నారు. శనివారం మద్దూరు మండలంలోని గాగిళ్లాపూర్‌లో ఇటీవల జాతీయ సీనియర్ మహిళా హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైన గుడిసె స్వర్ణతో పాటు ఆమె తల్లిదండ్రులను మేక సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో గ్రామస్తులు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ హ్యాండ్‌బాల్ పోటీలకు స్వర్ణ ఎంపిక కావడం గ్రామస్తులకు గర్వంగా ఉందన్నారు.కార్యక్రమంలో హ్యాండ్‌బాల్ కోచ్ దామెర మల్లేశం, హెచ్‌ఎం గుడిసె అంజయ్య, ఏఎంసీ డైరెక్టర్ మేక ఉమామహేశ్వర్, ఎస్‌ఎంసీ చైర్మన్ పుప్పాల బాలస్వామి, మాజీ ఎంపీటీసీ భూర్గు నర్సింహులు, నారదాసు అశోక్, గొండ్ల మహేశ్, నారదాసు సాయికుమార్ పాల్గొన్నారు.

కవి అన్నవరం దేవేందర్‌కు ఆహ్వానం

హుస్నాబాద్‌టౌన్, మార్చి 9: ఈనెల 11 నుంచి 16వరకు కేంద్రసాహిత్య అకాడమీ న్యూఢిల్లీలో నిర్వహించే సాహిత్య ఉత్సవం ఫెస్టివల్ ఆఫ్ లెటర్స్ 2024లో పాల్గొనేందుకు హుస్నాబాద్ ప్రాంతానికి చెందిన కవి అన్నవరం దేవేందర్‌కు ప్రత్యేక ఆహ్వానం అందింది. ఈ మేరకు సాహిత్య అకాడమీ కార్యదర్శి కె. శ్రీనివాస్ కవి సమ్మేళనంలో పాల్గొనాలని దేవేందర్‌కు ఆహ్వాన లేఖ పంపారు. సాహిత్య అకాడమీ 70 ఏండ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా ఆరు రోజులపాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద సాహిత్య ఉత్సవంలో 175భాషలు మాట్లాడే రచయితలు, కవులు, పరిశోధకులు పాల్గొంటున్నారని, ఇందులో 21వ శతాబ్దపు భారతీయ కవిత్వంపై నిర్వహించే కవి సమ్మేళనంలో పాల్గొనాలని దేవేందర్‌కు ఆహ్వాన లేఖను పంపారు. సాహిత్య ఉత్సవంలో పాల్గొనేందుకు అన్నవరం దేవేందర్‌కు ఆహ్వానం రావడంపై పలువురు హుస్నాబాద్ ప్రాంత కవులు, రచయితలు హర్షం వ్యక్తం చేశారు.

హుషారుగా నారీశక్తి ఫిట్‌నెస్ రన్

దుబ్బాక: నారీశక్తి ఫిట్‌నెస్ రన్‌లో పాల్గొన్న మహిళలు

దుబ్బాక, మార్చి 9: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో శనివారం దుబ్బాక కస్తూర్బా బాలికల విద్యాలయం విద్యార్థులు, ఉపాధ్యాయులకు నారీశక్తి ఫిట్‌నెస్ రన్ నిర్వహించారు. పోటీలో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. నెహ్రూ యువకేంద్రం జిల్లా అధికారి రంజిత్‌రెడ్డి, అకడమిక్ అధికారి భాస్కర్, ప్రిన్సిపాల్ స్వాతి పాల్గొన్నారు.

కేజీబీవీలో ఫిట్‌నెస్ పోటీలు

కొండపాక(కుకునూరుపల్లి), మార్చి 9 : కొండపాక మండల కేంద్రంలో కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో శనివారం నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో నారీశక్తి ఫిట్‌నెస్, రన్నింగ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నెహ్రూ యువ కేంద్రం వలంటీర్, సర్దార్ వల్లబాయ్ పటేల్ జాతీయ స్మారక పురస్కార గ్రహీత కొండాపురం నర్సింహులు హాజరై మాట్లాడారు. పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేకాధికారి గౌతమి, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

సిద్దిపేట,మార్చి 9: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని మున్సిపల్ చైర్ పర్సన్ కడవేర్గు మంజులా రాజనర్సు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని సిద్దిపేట పట్టణంలోని శ్రీవాణి హై స్కూల్‌లో శనివారం మహిళా దినోత్సవ సంబరాల్లో ఆమె పాల్గొని మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు.కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ శ్రీకాంత్, ప్రిన్సిపాల్ రవీందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రతాప్‌రెడ్డిని సన్మానిస్తున్న రాజేశ్వర్‌రెడ్డి

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

మద్దూరు(ధూళిమిట్ట), మార్చి 9: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం నిధులను ఖర్చు చేస్తున్నదని జనగామ డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. శనివారం మద్దూరు మండలంలోని సలాఖపూర్‌లోని ఎస్సీ కాలనీలో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీ మేరకు ఆరు గ్యారెంటీల్లో ఇప్పటికే నాలుగు అమలు చేసినట్లు తెలిపారు. జనగామ నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు తీసుకువస్తామన్నారు. అనంతరం కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిని ఎంపీటీసీ ఇర్రి రాజేశ్వర్‌రెడ్డి సన్మానించారు.

గజ్వేల్‌లో ఫ్లాగ్‌మార్చ్

గజ్వేల్, మార్చి 9: త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా గజ్వేల్‌లో శనివారం సాయంత్రం కేంద్ర బలగాలతో స్థానిక పోలీసులు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. పట్టణంలోని కోటమైసమ్మ దేవాలయం, పాండవుల చెరువు, ఎస్సీ కాలనీ, ఎల్లమ్మ టెంపుల్, పిడిచెడ్‌రోడ్డు, ప్రజ్ఞాపూర్ రోడ్డు, అంబేద్కర్‌చౌరస్తా, సంగాపూర్ మార్గాల్లో ఫ్లాగ్‌మార్చ్ చేపట్టారు. ఈ సందర్భంగా ఏసీపీ పురుషోత్తంరెడ్డి మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణ కోసం ఫ్లాగ్‌మార్చ్ చేపట్టామన్నారు. కార్యక్రమంలో సీఐలు సైదా, ముత్యంరాజు, లతీఫ్, మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

మహిళల త్యాగాలు వెలకట్టలేనివి

సిద్దిపేట, మార్చి 9 : సమాజంలో మహిళల త్యాగాలు వెలకట్టలేనివని గురుకులాల పేరెంట్స్ అసోసియేషన్ ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి మెట్ల శంకర్ అన్నారు. శనివారం స్వేరోస్ ఇంటర్నేషనల్ జిల్లా కమిటీ, గురుకులాల పేరెంట్స్ అసోసియేషన్ ఉమ్మడి మెదక్ జిల్లా కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని వైద్య రంగంలో సేవలందిస్తున్న సముద్రాల దుర్గా, ప్రముఖ నేత్ర వైద్య నిపుణురాలు మాధవిలకు జ్ఞాపిక అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో స్వేరోస్ ఇంటర్నేషనల్ జిల్లా అధ్యక్షుడు ఉప్పలేటి బాబు, ఉపాధ్యక్షుడు ఎడ్ల ప్రవీణ్‌కుమార్, సహాయకులు పాల్గొన్నారు.